నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, బుధవారం 18 సెప్టెంబర్ 2024 | NIZAMABAD





విద్యుద్దీపాలతో అలకరించిన వాహనాల్లో వినాయక ప్రతిమల ఊరేగింపు..



శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఇందూరు సార్వజనిక్ గణేశ్ మండలి అధ్యక్షుడు బంటు గణేశ్

# వినాయక వీడ్కోలు

**వినాయకులతో నిండిన వీధులు**
**ప్రశాంతంగా ముగిసిన శోభాయాత్ర**
**నృత్యాలతో హోరెత్తించిన యువత**



**భక్తుల** విశేష పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. జిల్లాలో మంగళవారం వినాయక శోభాయాత్ర ఘనంగా జరిగింది. నిజామాబాద్ నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ నిమజ్జన ప్రక్రియ వైభవంగా సాగింది. డీజేలు, బ్యాండు మేళాలు, డప్పు చప్పుళ్లతో పాటు నృత్యాలతో యువత హోరెత్తించారు. వినాయక శోభాయాత్ర ప్రశాంతంగా సాగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.





బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు..



బాసర గోదావరిలో గణపయ్యను నిమజ్జనం చేస్తున్న భక్తులు..



వినాయకుల బావి దగ్గర..



ప్రత్యేకంగా అలంకరించిన కారుపై గణేశ్ ప్రతిమలు..



ఇందూరులో శోభాయాత్రకు భారీగా తరలివచ్చిన భక్తగణం

# మువ్వన్నెల రెపరెపలు..

## ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



జెండావందనం చేస్తున్న అనిల్, కలెక్టర్, సీపీ, ఇతర ప్రజాప్రతినిధులు

కంఠేశ్వర్, సెప్టెంబర్ 17: జిల్లాలో ప్రజా పాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేసి, తెలంగాణ పోరాట యోధులను స్మరించుకున్నారు. కలెక్టరేట్‌లో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అబ్బురపరిచాయి. అనంతరం అనిల్ మాట్లాడుతూ.. తెలంగాణ తిరుగుబాటును ప్రపంచానికి చాటి చెప్పిన రోజు సెప్టెంబర్ 17వ తేదీ అని అన్నారు. దీన్ని స్ఫూర్తిగా ప్రజాస్వామిక, స్వేచ్ఛాయుత తెలంగాణ కోసం పునరంకితమవుదామని పిలుపునిచ్చారు. రూ.18 వేల కోట్లను ఖాతాల్లో వేసి 22 లక్షల రైతులను రుణ విముక్తుల్ని చేశామని చెప్పారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్ సింగేనవార్, మేయర్ నీతూకిరణ్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



డిచ్‌పల్లిలో క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, బాజిరెడ్డి జగన్, పార్టీ నేతలు

# 'కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడం ఖాయం'

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 17: సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహం కోసం నిర్దేశించిన స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు మంగళవారం జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. నిజామాబాద్, ఆర్మూర్, ఏర్గట్ల, బోధన్, నందిపేట్, మాక్లూర్, రెంజల్, నవీపేట్, డిచ్‌పల్లి తదితర మండలాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేసి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ నీతూకిరణ్, రాంకిషన్‌రావు తదితరులు మాట్లాడుతూ.. తెలంగాణ తల్లి విగ్రహం కోసం ఉద్దేశించిన స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడం సరికాదని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ప్రభాకర్‌రెడ్డి, రాజు, లక్ష్మారెడ్డి, రవిచందర్, మురళి, సదానంద్, సాగర్, గంగామణి, లింగం, రవి, శివ, సంతోష్ పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో నిర్వహించిన జాతీయ సమైక్యతా దినోత్సవంలో జిల్లా నేతలు ముజీబుద్దీన్, దఫేదార్ రాజు, విఠల్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# అక్రమాలపై జూపల్లి సీరియస్

## ఆబ్కారీలో అవినీతిపై 'నమస్తే' వరుస కథనాలు
## స్పందించిన మంత్రి.. విచారణకు ఆదేశం







నిజామాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అక్రమాలకు పాల్పడే అధికారులు ఎంతటి వారైనా ఉపేక్షించే పరిస్థితి లేదని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరించారు. ఆబ్కారీ శాఖలో జరుగుతున్న అక్రమాలపై 'నమస్తే తెలంగాణ' సోమ, మంగళవారాల్లో ప్రచురించిన వరుస కథనాలపై ఆయన స్పందించారు. నిజామాబాద్ జిల్లాలో అక్రమాల పర్వంపై సమగ్ర విచారణ చేయాలని ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్‌ను ఆదేశించారు. ఆబ్కారీ శాఖ బాధ్యతలు చూస్తున్న జూపల్లి కృష్ణారావు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీగా ప్రాతినిధ్యం వహిస్తున్న చోటే అక్రమాలకు అడ్డుకట్ట లేకపోవడం అనేక విమర్శలకు తావిస్తున్నది. అధికారుల బరితెగింపుపై బహిరంగంగానే చర్చ జరుగుతున్నది. ఎక్సైజ్ శాఖలో అవినీతి, వసూళ్ల పర్వాన్ని కళ్లకు కట్టినట్లు 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలను ప్రచురించిన సంగతి తెలిసిందే. మద్యం వ్యాపారులు, కల్లు డిపోలు, తదితర ముఠాల నుంచి అక్రమంగా వసూళ్లకు తెగబడుతూ జేబులు నింపుకుంటూ ప్రభుత్వ లక్ష్యాలను నీరుగారుస్తున్న వైనాన్ని నమస్తే తెలంగాణ ఎత్తిచూపింది. ఈ నేపథ్యంలోనే సీరియస్‌గా స్పందించిన మంత్రి జూపల్లి కృష్ణారావు సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామంటూ వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

### ఐఎంఎల్ డిపోలోనూ అదే వరుస..

నిజామాబాద్, కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా అన్ని వైన్ షాపులకు మద్యాన్ని సరఫరా చేసే ఐఎంఎల్ డిపోలోనూ అవినీతి జరుగుతున్నదని బాధితులు చెబుతున్నారు. ఈ మేరకు నమస్తే తెలంగాణ ప్రతినిధికి ఫోన్లు చేసి గోడు వెల్లబోసుకున్నారు. ఆబ్కారీ అవినీతిపై వార్తలు ప్రచురించడంపై హర్షం వ్యక్తం చేసిన బాధితులు.. ఐఎంఎల్ డిపోలోనూ ఎక్సైజ్ అధికారులే బ్రోకర్లను పెట్టి నెలవారీగా మామూళ్లను వసూళ్లు చేస్తున్నారని వెల్లడించారు. డబ్బులు ఇవ్వకపోతే మద్యం సరఫరాలో ఇబ్బందులు పెడుతున్నారని, చలాన్లు ముందే తీసుకున్నప్పటికీ చేయి తడపకపోతే లోడింగ్ విషయంలో జాప్యం చేస్తున్నారని వాపోయారు. వారి వేధింపులు భరించలేక రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు ఇస్తున్నట్లు చెప్పారు. ఇలా వసూలయ్యే మొత్తాన్ని కీలక అధికారులతో పాటు ఐఎంఎల్ డిపో నిర్వహణలో సంబంధం ఉన్న పాత్రధారులంతా పంచుకుంటున్నట్లు తెలిసింది. మాక్లూర్ మండలం మాదాపూర్‌లో ఉన్న ఐఎంఎల్ డిపోపై ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడం వెనుక అవినీతికి మద్దతుగా నిలుస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది.